భయంతో దూరం
చేసుకున్న
కుక్క అతనికి
పెంపుడు జంతువుగా
ఎలా మారింది?

# ఆ కుక్క

## అర్చనా చౌహాన్ కథ

**వా**డి వయస్సు ఆరేళ్లు!

పాలుగారే చెక్కిళ్లు, పెద్ద పెద్ద కళ్లు.

తలుపుచాటున నక్కి బయటకు తొంగిచూస్తున్నాడు.

"దీపూ! ఏంట్రా అలా నక్కుతున్నావు?" వంటింట్లోంచి లేచి అప్పుడే బయటకు వచ్చిన పూర్ణకు వాడి ప్రవర్తన అర్థంకాలేదు.

"నానమ్మా! ఆ పెద్ద కుక్క మళ్లీ వచ్చి మెట్లమీద కూచుంది. నేను బయటకు వెళ్లి ఆడుకుంటాను. దాన్ని తరిమెయ్యవూ?" దీపూ వెనక్కి తిరిగి అర్థించాడు.

వాడి మొహంలో భయం ప్రస్ఫుటం అవుతోంది. పూర్ణ బయటకు వచ్చి మెట్లమీదున్న కుక్కను చూసింది. అది నిండు గర్భంతో వుండి కింది మెట్టుమీద కూర్చుని ఆయాసపడుతోంది.


"ష్...ష్..." అది అదిలించింది పూర్ణ.

ఆ కుక్క ఆ అదిలింపుకి భయపడి పారిపోలేదు సరికదా లేచి అరుగుమీదకొచ్చి, అరుగు మూలకు సర్దుకుని కూచుంది. పూర్ణ ఎంత అదిలించినా మెల్లగా గుర్‌మందే తప్ప కదల్లేదు.

దీపూ ఎప్పుడో మెల్లగా పూర్ణ వెనకాల చేరి తొంగి తొంగి చూస్తున్నాడు. ఆ కుక్క గుర్రుమన్నప్పుడల్లా ఉలిక్కిపడి వెనక్కి జరిగి మళ్లీ తొంగిచూస్తున్నాడు.

ఆ కుక్క ఇంక కదిలేట్టు లేదని పూర్ణ దీపూతో "అదేమీ అనదుగానీ నువ్వెళ్లి ఆడుకో" అంది.

దీపూ ఆచితూచి అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లిగా మెట్లు దిగాడు. మెట్లు దిగుతున్నంతసేపూ వాడి చూపు కుక్కమీదే




వుంది. మెట్లు దిగీ దిగగానే తుర్రుమన్నాడు.

పూర్ణ తిరిగి వంటింట్లోకి వచ్చి పని చేసుకోసాగింది. ఆమె వంట పూర్తిచేసి పెరట్లో మొక్కలకు నీళ్లుపోసి వచ్చేసరికి దీపాల వేళయింది.

కాళ్లు చేతులు కడుక్కుని దేవునివద్ద దీపం ముట్టించింది. ఇంతలో ''నానమ్మా! నానమ్మా!'' అని బయట్నించి దీపూ కేకలు

వినపడ్డాయి పూర్ణకి. దీపూ అలా ఎందుకు అరుస్తున్నాడో అర్థంకాలేదు. బయటికి వచ్చి చూస్తే దీపూ గట్టిగా గొంతు చించుకుని అరుస్తున్నాడు.

''ఏంట్రా? ఇంట్లోకి రాకుండా ఏంటా కేకలు?'' అంటూ గదమాయించింది పూర్ణ.

''మరి ఆ కుక్క అక్కడుందిగా. నాకు భయం'' దీపూ అల్లంత దూరాన నిలబడి కుక్కకేసి భయంగా చూస్తున్నాడు.

''అయ్యో రాత! అదేం నిన్ను పీక్కు తినదులే. దానికి భయపడి ఇంట్లోకి రావడం మానుకుంటావా? అయినా ఈ వెధవ కుక్క ఇక్కడే తిష్టవేసిందేమిటి?'' పూర్ణ విసుగ్గా మళ్లీ కుక్కని అదిలించింది.

కుక్క ఇసుమంతకూడా కదల్లేదు. ఇహ లాభం లేదని పూర్ణ కట్టె పుచ్చుకుంది. కట్టె తీసుకున్నైతే వచ్చిందికానీ గర్భిణి కుక్కని కొట్టడానికి మనసొప్పలేదు. ఊరికే బెదిరిద్దామని కట్టెతో కుక్క పక్కనే అరుగుమీద గట్టిగా తాటించింది. ఆ చప్పుడికి కుక్క మరింత గట్టిగా, మరింత భయంకరంగా గుర్రుమంది.

పూర్ణ కొంచెం జంకింది. పోనీలే వెధవసంత! మీదపడి చీల్చినా చీల్చగలదని సణుక్కుంటూ దీపూని లోపలికి తీసుకెళ్లి తలుపు వేసుకుంది.

ఆ కుక్క దాదాపు వారం రోజుల్నుంచి ఇలాగే. వీళ్ల ఇంటి మెట్లమీద ముందు తర్వాత్తర్వాత ఇంటి అరుగుమీద పడుకుంటుంది. మొదట్లో. కేవలం రాత్రుళ్లు మాత్రమే వచ్చి పడుకునేది. ఈ మధ్య పగలుకూడా అక్కణ్ణుంచి కదలట్లేదు. దీపూకేమో దాన్ని చూస్తే ఒకటే భయం. పూర్ణ భర్త సుందరానికి ఎంత చెప్పినా పట్టించుకోడు. పైపెచ్చు పాపం మూగజీవి అంటూ రాత్రి మిగిలిపోయిన అన్నం వగైరాలు దానికి పెడుతున్నాడు. ఇది ఆ కుక్కకి బాగా అలవాటైంది. రాత్రిళ్లు పెట్టింది తిని సుబ్బరంగా అరుగుమీద పడుకుని ఇక పగటిపూటకూడా ఏదైనా పెట్టకపోతారా అని నాలుక బైటపెట్టి, ఆశగా చూస్తూ వుంటుంది.

శునకపు బుద్ధులని ఊరికే అన్నారా?

పూర్ణకు స్వతహాగానే జంతువులంటే గిట్టదు. ఇంక ఆ కుక్కని చూస్తే పరమ చిరాకు. ఊరకుక్క! మంచి జాతి కుక్కైనా బావుండు. అదలా అరుగునంతా ఆక్రమించేసి మకాం పెట్టడం ఆమెకేం నచ్చలేదు.

ఓరోజు మధ్యాహ్నం దీపూకి అన్నం తినిపిస్తూ వుంటే ఉన్నట్లుండి - ''నానమ్మా కుక్కలు మీదపడి పొట్ట చీరేస్తాయా? మరి ఆ పెద్దకుక్క నామీదపడి అలా చేస్తే నేను చచ్చిపోనూ?'' అనడిగాడు.

నోరంతా పెరుగు పులుముకుని, అమాయకంగా, భయంగా వాడలా అడుగుంటే పూర్ణకు వాడిమీద జాలేసింది. వాడికి ఈ మధ్య ఆ కుక్కంటే భయం మితిమీరుతోందని ఆమె గ్రహించింది. ఏదో చెప్పి వాడికి సరిపుచ్చినా మళ్లీ మళ్లీ పిచ్చికుక్కలగురించీ, వాటి గురించి, వీటిగురించీ, ఒకటే ప్రశ్నలువేయడం మొదలెట్టాడు. ఆ కుక్కని ఎలాగైనా వెళ్లగొట్టాలని నిశ్చయించుకుంది.

ఆరోజు సాయంత్రం దీపూ ఆడుకోవడానికి వెళ్లాడు. పూర్ణకి వంట్లో కాస్త నలతగా అన్పించి వంటింటి గోడమీద తల వాల్చింది. ఎప్పుడు కునుకుపట్టిందో తెలీదు. భర్త వచ్చి తట్టి లేపితే ఉలిక్కిపడి లేచింది.

''ఏంటిలా పడుకున్నావు? దీపూ ఏడి?''

సుందరం బట్టలు మారుస్తూ అడిగాడు.

''అవును! దీపూ ఏడి?'' అంటూ పూర్ణ ఇల్లంతా వెతికింది. దీపూ ఎక్కడా కనిపించలేదు.

బయటకు వచ్చి చూస్తే వీధంతా సద్దుమణిగి వుంది. ఎక్కడా దీపు జాడలేదు. పూర్ణకు గాభరా మొదలయింది. భార్యాభర్తలు కలిసి వీధంతా గాలించారు. ఎక్కడా దీపులేడు.

పూర్ణకు ఏడుపొక్కటే తక్కువలా వుంది. ఎవరినని లేపి అడగాలో అర్థంకాలేదు. చివరికి ఎదురింటి స్వర్ణే తలుపుతీసి -

''పిన్నిగారూ! దీపూ ఇక్కడ'' అని పిలిచింది.

''మీ ఇంట్లోనా?'' పూర్ణ ఆశ్చర్యపోయింది.

''అవును. మిమ్మల్ని ఇంటిముందు నిలబడి చాలాసేపు పిల్చాడు. మీరు పడుకున్నట్టున్నారు. ఇంట్లోకి వెళ్లమంటే కుక్కకి భయపడి మొత్తానికి మా ఇంట్లోనే పడుకున్నాడు'' అని స్వర్ణ లోనికెళ్లి చిన్నారి దీపూని భుజానేసుకుని తిరిగి వచ్చింది.

పూర్ణ దీపూని తీసుకుంటూ ''ఏమైనా తిన్నాడా?'' అనడిగింది.

''ఉహు! ఎంత తినమన్నా తిన్లేదు'' సానుభూతిగా చెప్పింది స్వర్ణ.

ఇక పూర్ణ సుందరమ్మీద విరుచుకుపడింది.

''ఇదంతా మీవల్లే. వద్దు వద్దన్నా వినకుండా ఆ కుక్కని మచ్చిక చేసుకున్నారు. దీపూకి అదంటే భయమని చెప్పానా? ఇప్పుడు చూడండి. పిల్లాడు ఆకలితో పడుకున్నాడు'' ధుమధుమలాడ్తూ అరుగుమీదున్న కుక్కకేసి ఛీత్కారంగా చూసి లోనికెళ్లింది.

దీపూని మంచంమ్మీద పడుకోబెట్టి ''ఇప్పుడే చెప్తున్నాను. ఆ కుక్క రేపు అరుగుమీద కన్పించిందంటే దాని వీపు చీరేస్తాను. ఎలా వెళ్లగొడ్తారో మీ ఇష్టం. లేదంటే నేనే రేపు ఇంత విషం కల్పి దానికి అన్నం పెట్టేస్తాను. పీడా వదులుద్ది!'' అని భర్తకు వార్నింగిచ్చింది.

''సరేలే! ముందు నాకు అన్నంపెట్టు'' సుందరం కాళ్లు కడుక్కుని పీట

## చైనా ఆచారం



చైనావారికి మృతదేహాలను పాతిపెట్టడమే తప్ప దహనం చేసే ఆచారం లేదు. పెరిగిన జనాభా కారణంగా స్మశాన వాటికలు కూడా క్రిక్కిరిసిపోవడంతో తూర్పు చైనాలోని జియాంగ్ సుప్రావిన్స్‌కు చెందిన స్థానిక ప్రభుత్వాధికారులు ఏప్రిల్ *1, 1993* తర్వాత మరణించేవారిని దహనం చేయడమే తప్ప, ఖననం చేయడం కుదరదని ప్రకటించడంతో, అనాదిగా వస్తున్న ఆచారాలను కాదని తమ మృతదేహాలు దహనం చేయడానికి ఇష్టపడని ఎందరో వృద్ధులు ఏప్రిల్ 1కి ముందుగానే నదుల్లో దూకి, స్లీపింగ్ పిల్స్ మింగి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరణానంతరం ఖననం చేయబడకపోతే అలాంటి వ్యక్తి పూర్వీకులకు సద్గతులుండవన్నది చైనీయుల నమ్మకం.

- రజనీ శకుంతల

వేసుక్కూర్చున్నాడు.

పూర్ణ అతనికి అన్నం వడ్డించి దీపూని లేపడానికి ప్రయత్నించింది. ఎంత లేపినా అతను అటు ఇటు తిరిగి మళ్లీ పడుకున్నాడు. దీపూ తిన్లేదని పూర్ణకి కూడా అన్న సయించలేదు. అసలే ఆవెూకెందుకో చాలా అసలటగా వుంది. తనుకూడా దీపూ పక్కనే పడుకుంది.

ఓ అర్థరాత్రివేళ కుక్క మొరుగుతుంటే మెలకువ వచ్చింది. బయట కుక్క ఒకటే మొరుగుతోంది.

''అబ్బా! ఇదొకటి కొత్తగా మొదలెట్టిందా! ఇంక రాత్రిళ్ల నిద్రపోనివ్వదు కాబోలు'' పూర్ణకు చిరాకేసింది.

వెళ్లి భర్తని తట్టి లేపింది.

''ఆ కుక్క చూడండి. ఎలా మొరుగుతోందో. వెళ్లి చూడండి. రెండు తగిలిస్తే ఊరుకుంటుంది'' అంది.

''అబ్బా! రేప్పొద్దున దాన్ని తీస్కెని వెళ్లమని మున్సిపాలటీవాళ్లకి చెప్తాన్లే. ఇప్పుడు పడుకో.'' సుందరం అటు తిరిగి పడుక్కున్నాడు.

పూర్ణ కాసేపు చూసింది. కుక్క మొరగడం ఆపలేదు.

వెళ్లి కిటికీ తెరిచి గట్టిగా అదిలించిందిగాని పూర్ణకు కుక్క కన్పించలేదు. ఇంతలో పెరటివైపునుంచి అవస్థపడుతూ వచ్చి, తిరిగి అరుగుమీద పడుకుంది. అది చూసి పూర్ణకు ఇంకాస్త కోపం వచ్చింది.

''ఇక పెరట్లోకి కూడా పోవడం మొదలెట్టిందా?'' అని తిట్టుకుంటూ వచ్చి పడుకుంది.

తెలతెలవారుతుండగా పూర్ణకు మెలకువొచ్చి చూస్తే పక్కన దీపూ లేడు.

పెరట్లోకి వెళ్లాడేమోనని పెరట్లోకి వచ్చిన పూర్ణ అక్కడి పరిస్థితిని చూసి విస్తుపోయింది. పెరట్లో ఎవరో అటూ ఇటూ పరుగెత్తి అంతా నాశనం చేశారు. మొక్కలన్నీ చిందరవందరై వున్నాయి.

ఎవరై వుంటారా అని ఆవిడ ఆశ్చర్యపోతు న్నంతలో వెనుకింటి శైలజ గోడమీంచి తొంగిచూసింది.

''ఏం పిన్నిగారూ! మీ అబ్బాయీ, కోడలూ ఊర్నించి తిరిగొచ్చేశారా?'' అనడిగింది.

''లేదమ్మా! ఏం అలా అడుగుతున్నావు?'' అని పూర్ణ మరింత ఆశ్చర్యపోయింది.

''అయ్యో రాలేదా? మరి రాత్రెవరు పెరట్లో తచ్చాడుతున్నారు? మీ అబ్బాయనుకున్నాను సుమా!'' అంటూ శైలజ ఆత్రంగా గోడమీదకు మరింత వంగింది.

''అరెరె ఈ మొక్కలేంటి ఇలా అయ్యాయి?''

''అదే నాకూ అర్థంకావడంలేదు'' పూర్ణ ఇలా అన్నదేకాని ఆమెకు చూచాయగా అర్థమైంది.

రాత్రెవరో దొంగవెధవ పెరట్లోకి దూరుంటాడు. అందుకే ఆ కుక్క అంతలా మొరిగింది. తను అనవసరంగా తిట్టుకుందేగానీ బయటకు వచ్చి చూస్తే బావుండేది.

పరీక్షగా చూస్తే పెరటి గోడమీద కుక్క అడుగు గుర్తులున్నాయి. ఆ గర్భావస్థలో అది ఎంత కష్టపడి ఎక్కిందో పాపం!

ఏదో రెండు మెతుకులు విదిలించిన భాగ్యానికి అది అంతలా మొరిగి దొంగని వెళ్లగొట్టి తన విశ్వాసాన్ని చూపింది. పూర్ణకి ఆ కుక్కమీద దయతో మనసంతా నిండిపోయింది.

''ఇప్పుడే వస్తాను'' అని శైలజనలాగే

సస్పెన్స్‌లో వుంచి ఇంట్లోకి వచ్చింది. భర్తను లేపి ఈ సంగతి చెప్దామనుకునేంతలో ఆమెకి మళ్లీ దీపూ గుర్తొచ్చాడు.

బయటి తలుపు ఓరగా తీసి వుంది. భర్తను లేపడం మానేసి దీపూని వెతుకుతూ బైటికి వచ్చిన పూర్ణ అరుగుమీద కన్పించిన దృశ్యాన్ని చూసి అలా నిలబడిపోయింది.

అరుగుమీద ఆ కుక్క ఎప్పటిలా పడుకుని వుందిగానీ అదిప్పుడు గర్భంతో లేదు. దాని పక్కనే నాలుగు చిన్నచిన్న కుక్కపిల్లలున్నాయి. ముద్దుముద్దుగా, బుజ్జిబుజ్జిగా! అవింకా కళ్లుకూడా తెరవలేదు.

ఆ పిల్లల మధ్య దీపూ! వాటిని ముట్టుకుంటూ, సవరిస్తూ, ఆడుతూ -

వాడి మొహంలో ఆనందం ఉట్టిపడుతోంది. ఆ కుక్క కళ్లు మిలమిల లాడుతున్నాయి.

'మున్సిపాలిటీని పిలవక్కరలేదు' అని భర్తకి చెప్పడానికి ఇంట్లోకి నడిచింది పూర్ణ! ✸

